

KADILIMCHE VAARTHA Telugu daily

కదిలించే కథ

తెలుగు దినపత్రిక

TV6 NATIONAL NEWS CHANNEL

బ్యూరో చీఫ్ జోడు రమేష్ కుమార్, కడప జిల్లా, అన్నమయ్య జిల్లా అన్నమయ్య జిల్లా : సంపుటి : 251 ఆదివారం 08 నవంబర్ 2026 పేజీలు 8 వెల : 05

Published From Kadapa : Circulated at | Ananthapuram | Tirupati | Vishakapatnam | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Vijayawada | Ongole | Chittore | Khammam | Hyderabad | Mahabubnagar

పులివెందులలో వైసీపీకి మరో షాక్.. జడ్పీటీసీ స్థానాన్ని కైవసం చేసుకున్న టీడీపీ



- 1463 ఓట్ల తేడాతో టీడీపీ అభ్యర్థి భారతి విజయం
- ఇటీవలే మున్సిపల్ ఎన్నికల్లోనూ వైసీపీ పరాజయం
- జడ్పీటీసీ విజయంతో టీడీపీ శ్రేణుల్లో మిన్నంటిన సంబరాలు

2లో..



అప్పిరెడ్డిపై అక్రమ కేసు పెట్టారు..


- ఇది దుర్మార్గం: అంబటి రాంబాబు
- బ్యాలెట్ బాక్స్ మాయం చేయడాన్ని అడ్డుకున్నందుకే ఈ చర్యలన్న అంబటి
- న్యాయం కోసం ధర్నా చేస్తుంటే లాఠీచార్జ్ చేశారని విమర్శ
- టీడీపీ నేతలు, అధికారులు, పోలీసులు కలిసిపోయారని ఆరోపణ

2లో..

విశాఖ వేదికగా గ్లోబల్ సమ్మిట్..

- ప్రపంచ పెట్టుబడులే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం

- నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖలో 'సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్'
- 59 దేశాల నుంచి 1250 మందికి పైగా ప్రతినిధుల భాగస్వామ్యం
- ఏపీలో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా సీఎం చంద్రబాబు సమీక్ష
- వాణిజ్యం, గ్రీన్ ఎనర్జీ సహా ఆరు కీలక రంగాలపై ప్రధానంగా చర్చలు
- పారిశ్రామిక భాగస్వామ్యాల కోసం 400 బీటుబీ సమావేశాలు



విశాఖపట్నం నగరం మరో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ సదస్సుకు వేదిక కానుంది. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆధ్వర్యంలో 31వ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖలో జరగనుంది. 'నావిగేటింగ్ న్యూ వరల్డ్ ఆర్డర్: ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్' అనే థీమ్‌తో నిర్వహించే ఈ సదస్సులో 59 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొననున్నారు. ప్రపంచ దేశాల ప్రభుత్వ ప్రతినిధులు, పారిశ్రామిక దిగ్గజాలు, సాంకేతిక నిపుణులను ఒకే వేదికపైకి తీసుకురావడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం.ఈ సదస్సు ఏర్పాట్లపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు సీఐఐ ప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ఈ సదస్సు ద్వారా ప్రపంచానికి తెలియజేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. విధాన రూపకర్తలు, పెట్టుబడిదారులు, విద్యాసంస్థలు, అంకుర సంస్థలను

- మిగతా2లో...

హిందూపురం కౌంటింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత

- కౌంటింగ్ కేంద్రంలోకి బాలకృష్ణ పీఏ వెళ్లారంటూ వైసీపీ ఆరోపణ
- గేట్లు దూకి లోపలికి వెళ్లేందుకు యత్నించిన వైసీపీ కార్యకర్తలు
- ఆందోళనకారులను పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట

2లో..



పల్లె, పట్టణం ఏకమై కూటమికి పట్టం కట్టాయి



- పరిషత్ ఎన్నికల్లోనూ కూటమికి ప్రజలు బ్రహ్మరథం పట్టారన్న ఎమ్మెల్యే
- ఎన్నికల ఫలితాలపై జగన్ వ్యాఖ్యలు ఆయన అపరిపక్వతకు నిదర్శనమని విమర్శ
- పులివెందులలో ఓటమిపైనా వైసీపీ ఆత్మపరిశీలన చేసుకోవాలన్న గద్దె రామ్మోహన్
- ప్రజా తీర్పును అపహాస్యం చేయడం మానుకోవాలని హితవు
- కూటమి పాలనపై ప్రజలు పూర్తి సంతృప్తితో ఉన్నారని ఫలితాలు చెబుతున్నాయని వెల్లడి

2లో..

ఎమ్మెల్సీపై డెకాయిటీ కేసులా?

- చంద్రబాబు సర్కారుపై జగన్ ఫైర్
- ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అరెస్టును ఖండించిన జగన్
- బ్యాలెట్ బాక్సుల తరలింపును ప్రశ్నించినందుకు అరెస్టు చేశారని ఆరోపణ
- టీడీపీ పాలన ఎమర్జెన్సీని తలపిస్తోందని విమర్శ

2లో..



మేకపాటి సొంతూరిలో టీడీపీ జెండా..

- పరిషత్ ఉపఎన్నికల్లో కూటమి హవా
- మేకపాటి కుటుంబానికి సొంత గ్రామమైన బ్రాహ్మణపల్లిలో ఎదురుదెబ్బ
- ఎన్టీఆర్ స్వగ్రామం నిమ్మకూరులోనూ టీడీపీ అభ్యర్థి గెలుపు
- పరిషత్ ఉపఎన్నికల కౌంటింగ్‌లో అధిక స్థానాల్లో కూటమి ఆధిక్యం

2లో..

బొత్స కుటుంబానికి షాక్.. జడ్పీటీసీ బరిలో కుమార్తె అనూష పరాజయం

- బొండపల్లి జడ్పీటీసీగా తెదేపా అభ్యర్థి పాశల నీరజ విజయం
- బొత్స కుమార్తె అనూషపై 5,136 ఓట్ల మెజార్టీ
- జడ్పీ చైర్‌పర్సన్ రేసులో ఉన్న అనూషకు పరాజయం
- బొత్స కుటుంబం నుంచి నలుగురు పోటీకి ప్రయత్నం

2లో..

- తెర్లాంలో కూటమి తరఫున బొత్స మేనల్లుడి కుమార్తె సిరి సహస్ర విజయం



విశాఖ వేదికగా గ్లోబల్ సమ్మిట్..

-మొదటిపేజీ తరువాయి

అనుసంధానించడం ద్వారా చర్చలను వాణిజ్య, సాంకేతిక భాగస్వామ్యాల దిశగా నడిపించాలని సూచించారు. రాష్ట్రంలో పెట్టుబడులు సురక్షితం, సులభతరం అనే భరోసాను ప్రపంచ పారిశ్రామికవేత్తలకు కల్పించాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, సెమికండక్టర్ రంగాల్లో ఉన్న పెట్టుబడి అవకాశాలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు.ఈ సదస్సులో మొత్తం 1,250 మందికి పైగా దేశ, విదేశీ ప్రతినిధులు పాల్గొంటారని అంచనా. వీరిలో 15 మంది విదేశీ మంత్రులు, 40 మందికి పైగా అంతర్జాతీయ వక్తలు, 350 మంది విదేశీ ప్రతినిధులు, 900 మంది భారతీయ ప్రతినిధులు ఉన్నారు. సింగపూర్, నేపాల్, యూఏఈ, కెనడా, ఈజిప్ట్ వంటి అనేక దేశాల నుంచి ప్రభుత్వ ప్రతినిధులు, మంత్రులు హాజరుకానున్నారు. అలాగే, ప్రపంచ ఆహార కార్యక్రమం, ఆసియా అభివృద్ధి బ్యాంకు, ఐక్యరాజ్యసమితి వర్యావరణ కార్యక్రమం వంటి అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు కూడా పాల్గొంటారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ఆరు కీలక అంశాలపై ప్రధానంగా చర్చలు జరగనున్నాయి. వాణిజ్యం-పెట్టుబడులు, వ్యవసాయం-ఆహార భద్రత, నైపుణ్యాలు-అంతర్జాతీయ ఉపాధి, టెక్నాలజీ-భవిష్యత్ పరిశ్రమలు, స్వచ్ఛ ఇంధనం-సుస్థిర వృద్ధి వంటి అంశాలపై నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. వ్యాపార సంస్థల మధ్య కొత్త ఒప్పందాలు, భాగస్వామ్యాలను ప్రోత్సహించేందుకు 400కు పైగా బిజినెస్ టు బిజినెస్ (బీటుబీ), ప్రభుత్వాలతో పరిశ్రమల సంప్రదింపుల కోసం బిజినెస్ టు గవర్నమెంట్ (బీటుజీ) సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సదస్సు ద్వారా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతికి కొత్త ఊపు వస్తుందని, రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

బొత్స కుటుంబానికి షాక్.. జడ్పీటీసీ బరిలో కుమార్తె అనూష పరాజయం

-మొదటిపేజీ తరువాయి

పరిషత్ ఎన్నికల్లో కూటమి విజయపరంపర కొనసాగుతోంది. విజయనగరం జిల్లాలోని బొండపల్లి జడ్పీటీసీ స్థానంలో టీడీపీ అభ్యర్థి పాశల నీరజ విజయం సాధించారు. ఇక్కడ వైసీపీ తరపున పోటీ చేసిన శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ కుమార్తె అనూష ఓటమి పాలయ్యారు. నీరజ.. అనూషపై 5,136 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. దీంతో బొండపల్లిలో కూటమి శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రేసులో ఉన్న అనూష వరాజయం వైసీపీ శ్రేణులకు నిరాశ కలిగించింది.మరోవైపు బొత్స కుటుంబం నుంచి నలుగురు జడ్పీటీసీ స్థానాలకు పోటీ చేయాలని ప్రయత్నించడం ఈ ఎన్నికల్లో ఆసక్తికరంగా మారింది. పూసపాటిరేగ జడ్పీటీసీ స్థానానికి బొత్స సోదరుడి కుమారుడు చైతన్య నామినేషన్ దాఖలు చేయగా.. అది తిరస్కరణకు గురైంది. బొండపల్లి నుంచి కుమార్తె అనూష, గరివిడి నుంచి కోడలు బొత్స పూజిత, గుర్ల మండలం నుంచి సోదరి సంగంరెడ్డి వెంకటలక్ష్మి బరిలోకి దిగారు. అయితే స్థానిక ఎన్నికలకు ముందు తెదేపాలో చేరిన బొత్స మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కుమార్తె సిరి సహస్ర తెర్లాం జడ్పీటీసీ స్థానం నుంచి విజయం సాధించారు. దీంతో ఒకే కుటుంబానికి చెందిన వలువురు అభ్యర్థుల పోటీ, వారి గెలుపోటములు విజయనగరం జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. బొండపల్లిలో పాశల నీరజ విజయం వెనుక మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అనుసరించిన ఎన్నికల వ్యూహం కీలకంగా మారిందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహించడం, నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకోవడం, ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలవడంపై ఆయన ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొంటున్నాయి. భారీ సభలు, ఆర్భాటపు ప్రచారాల కంటే ప్రజలతో నేరుగా మమేకమవడమే నీరజ విజయానికి దోహదపడిందని తెదేపా నేతలు విశ్లేషిస్తున్నారు.

పల్లె, పట్టణం ఏకమై కూటమికి పట్టం కట్టాయ్

-మొదటిపేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్‌లో పట్టణాల నుంచి పల్లెల వరకు ప్రజలు కూటమి పాలనకే సంపూర్ణ మద్దతు ప్రకటించారని, పరిషత్ ఎన్నికల్లో చారిత్రాత్మక విజయాన్ని అందించి తమపై విశ్వాసాన్ని మరోసారి చాటారని విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు పేర్కొన్నారు. ఇంతటి ఘన విజయాన్ని అందించిన రాష్ట్ర ప్రజానీకానికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేత జగన్ మోహన్ రెడ్డి తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

-ఓటమిని జీర్ణించుకోలేకే జగన్ విమర్శలు

రాష్ట్రంలో సుమారు 2.6 కోట్ల మంది ప్రజలు స్వచ్ఛందంగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకుంటే, “ఇవి అసలు ఎన్నికలేనా?” అంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చులకనగా మాట్లాడటం అత్యంత బాధ్యతారాహిత్యమని గద్దె మండిపడ్డారు. గత రెండున్నర సంవత్సరాలుగా ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో అనుమానాలు సృష్టించేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. “2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇస్తే, ఓటమిని జీర్ణించుకోలేక ఈవీఎంలపై నిందలు వేశారు. ఇప్పుడు బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు జరిగితే అంతకంటే ఘనమైన విజయాన్ని ప్రజలు కూటమికి అందించారు. మరి ఇప్పుడు దేనిని తప్పుపడతారో జగన్ సమాధానం చెప్పాలి” అని గద్దె నిలదీశారు. ఇప్పటికైనా ప్రతిపక్ష నేతలు వాస్తవాలను గ్రహించి, ఫలితాలను వక్రీకరించడం మానుకోవాలని హితవు పలికారు.

-పులివెందుల తీర్పుతోనైనా కళ్లు తెరవండి

నామినేషన్లు వేయనివ్వలేదంటూ వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు పచ్చి అబద్ధమని గద్దె రామ్మోహన్ కొట్టిపారేశారు. సుమారు 9 వేలకు పైగా స్థానాలకు జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి 19 వేల మంది, వైసీపీ నుంచి 16 వేల మందికి పైగా నామినేషన్లు దాఖలు చేశారని గుర్తుచేశారు. ఇంత స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగినా అసత్యాలు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ ప్రజలు ఇచ్చిన తీర్పునే, గ్రామీణ ప్రజలు పరిషత్ ఎన్నికల్లో పునరావృతం చేశారని తెలిపారు. “చివరకు జగన్ సొంత నియోజకవర్గమైన పులివెందులలోనూ జడ్పీటీసీ స్థానాన్ని కూటమి భారీ మెజారిటీతో గెలుచుకుంది. ఈ ఫలితాలు ఎందుకు వచ్చాయో ఆత్మపరిశీలన చేసుకోవాల్సింది పోయి, ఎన్నికలనే ప్రశ్నించడం వారి అపరిపక్వతకు నిదర్శనం” అని ఆయన విమర్శించారు. గత ఐదేళ్ల వైసీపీ విధ్వంసకర పాలనను, అరాచకాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని, ఆ చేదు జ్ఞాపకాలే ఈ తీర్పునకు కారణమని స్పష్టం చేశారు.

-ప్రజాస్వామ్యంపై గౌరవం లేని వ్యక్తి జగన్

జగన్ మోహన్ రెడ్డికి ప్రజాస్వామ్యంపైనా, ఎన్నికల ప్రక్రియపైనా ఏమాత్రం గౌరవం లేదని గద్దె రామ్మోహన్ తీవ్రంగా విమర్శించారు. “ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత సృష్టించాలనే కుట్రతో రోజూ వచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. ఆయన తీరు చూస్తుంటే ఓటు వేయడానికి కూడా ఆసక్తి లేనట్లుంది. అలాంటి వ్యక్తి ఏ ముఖం పెట్టుకుని ప్రజలను ఓట్లు అడుగుతారు? రాజకీయాల్లో గెలుపోటములను సహజంగా స్వీకరించకుండా అబద్ధాలతో కాలం గడపలేరు” అని హెచ్చరించారు. తాము ఈ ఎన్నికలను రెండున్నరేళ్ల పాలనపై ప్రజాభిప్రాయ సేకరణగా (రెఫరెండం) భావించామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్ నేతృత్వంలో ప్రజాభిప్రాయాన్ని గౌరవిస్తూ, లోపాలుంటే సరిదిద్దుకుని మరింత నిబద్ధతతో పనిచేస్తామని హామీ ఇచ్చారు. అన్న క్యాంటీన్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం వంటి వథకాలతో ప్రజలు పూర్తి సంతృప్తితో ఉన్నారని, ఈ ఎన్నికల ఫలితాలే దానికి నిదర్శనమని గద్దె వివరించారు. ప్రజలు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తూ, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుని 2029 ఎన్నికల్లోనూ సంపూర్ణ విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక విజయానికి కృషి చేసిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ శ్రేణులకు, నాయకులకు, కార్యకర్తలకు, రాష్ట్ర ప్రజలకు ఆయన మరోసారి ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మెల్సీపై డెకాయిటీ కేసులా?

-మొదటిపేజీ తరువాయి

వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అరెస్టును ఆ పార్టీ అధినేత జగన్ తీవ్రంగా ఖండించారు. ఎన్నికల అక్రమాలను ప్రశ్నిస్తూ శాంతియుతంగా నిరసన తెలిపిన వారిపై తప్పుడు కేసులు బనాయించి, నిర్బంధించడం దుర్మార్గమని మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎమర్జెన్సీని తలపించే పాలన నడుస్తోందని, ఇది అత్యంత హేయమని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ‘ఎక్స్’ వేదికగా విమర్శించారు. గురువారం పరిషత్ ఎన్నికల పోలింగ్ ముగిశాక, గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెం నుంచి నాగార్జున యూనివర్సిటీలోని స్ట్రాంగ్‌రూమ్‌కు వెళ్లాల్సిన బ్యాలెట్ బాక్సులను మధ్యలో నల్లపాడు వద్ద ఎందుకు దించారని జగన్ ప్రశ్నించారు. ఈ అక్రమాన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై లాఠీఛార్జ్ చేయడం దారుణమన్నారు. తప్పు చేసి, బ్యాలెట్ బాక్సులు మార్చే ప్రయత్నం చేస్తూ, మళ్లీ తమ వారిపైనే అక్రమ కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకంగా ఒక ఎమ్మెల్సీపై డెకాయిటీ, దొంగతనం కేసులు పెట్టడం కంటే దుర్మార్గం ఏముంటుందని నిలదీశారు. ఈ సందర్భంగా చంద్రబాబును ఉద్దేశించి, “ఈ స్థానిక ఎన్నికల్లో నామినేషన్ల నుంచి బ్యాలెట్ బాక్సుల వరకు అన్నింటినీ రిగ్గింగ్ చేస్తున్నారు. ఈ రకంగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుంటే, ప్రశ్నించిన వారిని అరెస్టు చేసి జైలుకు పంపుతారా? అధికార, పోలీసు బలంతో అక్రమాలు దాచిపెట్టలేరు. మీ అప్రజాస్వామిక పద్ధతులను దేశమంతా చూస్తోంది. ప్రజలు మీకు తగిన బుద్ధి చెబుతారు’’ అని జగన్ తన ట్వీట్‌లో హెచ్చరించారు.

మేకపాటి సొంతూరిలో టీడీపీ జెండా..

-మొదటిపేజీ తరువాయి

ముఖ్యంగా, నెల్లూరు జిల్లాలో మేకపాటి కుటుంబానికి వారి సొంత గ్రామమైన బ్రాహ్మణపల్లిలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇక్కడి ఎంపీటీసీ స్థానాన్ని తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కైవసం చేసుకుని సంచలనం సృష్టించారు. అత్యధిక మెజార్టీతో టీడీపీ అభ్యర్థి విజయం సాధించడం మేకపాటి కుటుంబానికి రాజకీయంగా పెద్ద షాక్‌గా మారింది. రాష్ట్రవ్యాప్తంగా చాలాచోట్ల టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు స్పష్టమైన ఆధిక్యం ప్రదర్శిస్తున్నారు. ఉదయం బ్యాలెట్ బాక్సులను తెరిచి లెక్కింపు ప్రారంభించినప్పటి నుంచి కూటమి హవానే కొనసాగుతోంది. అనేక స్థానాల్లో ఇప్పటికే విజయం సాధించగా, మరికొన్ని చోట్ల ఆధిక్యంలో దూసుకెళ్తున్నారు. కృష్ణా జిల్లాలోని టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ స్వగ్రామం నిమ్మకూరులోనూ టీడీపీ జయభేరి మోగించింది. ఇక్కడ ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేసిన మాచర్ల కల్పన 560 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. నెల్లూరు జిల్లా ఫలితాలు కూడా టీడీపీకి ఉత్సాహాన్నిస్తున్నాయి. జిల్లాలోని 12 ఎంపీటీసీ స్థానాలకు గాను ఒకటి ఏకగ్రీవం కాగా, లెక్కింపు జరిగిన 11 స్థానాల్లో ఐదింటిని టీడీపీ కైవసం చేసుకుంది. మిగిలిన ఆరు స్థానాల్లోనూ టీడీపీ అభ్యర్థులే ఆధిక్యంలో కొనసాగుతున్నారు. నెల్లూరు రూరల్ జడ్పీటీసీ స్థానంలోనూ టీడీపీ అభ్యర్థి స్పష్టమైన ఆధిక్యాన్ని కనబరుస్తున్నారు. మొత్తంగా ఈ ఫలితాలు కూటమి శ్రేణుల్లో కొత్త జోష్ నింపుతున్నాయి.

హిందూపురం కౌంటింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత

-మొదటిపేజీ తరువాయి

ఏపీలో పరిషత్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా హిందూపురంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం వద్ద వైసీపీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. దీంతో అక్కడ పోలీసులు, వైసీపీ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. వివరాల్లోకి వెళితే, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పీఏ శ్రీనివాసరావు నిబంధనలకు విరుద్ధంగా కౌంటింగ్ కేంద్రంలోకి ప్రవేశించారని వైసీపీ నేతలు ఆరోపించారు. దీనికి నిరసనగా వైసీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని ఆందోళన చేపట్టారు. కొందరు కార్యకర్తలు గేట్లు దూకి కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో వారిని అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. దీంతో ఆందోళనకారులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళన చేస్తున్న వైసీపీ నాయకులను, కార్యకర్తలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనతో కౌంటింగ్ కేంద్రం వద్ద కాసేపు గందరగోళం నెలకొంది.

అప్పిరెడ్డిపై అక్రమ కేసు పెట్టారు..

-మొదటిపేజీ తరువాయి

వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిపై అక్రమ కేసు నమోదు చేయడం దుర్మార్గమైన చర్య అని మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. టీడీపీ నేతలు, అధికారులు కుమ్మక్కై ఈ చర్యకు పాల్పడ్డారని ఆరోపించారు. గుంటూరులో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వెంగళాయపాలెంకు చెందిన బ్యాలెట్ బాక్స్‌ను అధికారులు మాయం చేయాలని చూశారని, దీనిని వైసీపీ శ్రేణులు అడ్డుకున్నాయని అంబటి తెలిపారు. న్యాయం కోసం శాంతియుతంగా ధర్నా చేస్తున్న అప్పిరెడ్డితో పాటు ఇతర నేతలపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం దారుణమన్నారు. “దోపిడీ చేస్తున్న వారికి రక్షణ కల్పిస్తూ, దానిని అడ్డుకున్న వారికి శిక్ష వేస్తారా? రక్షించాల్సిన పోలీసులే భక్షిస్తుంటే ఏం చేయాలి?” అని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. టీడీపీ నేతలు అప్పిరెడ్డిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, అన్యాయాలను అడ్డుకుంటే కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. పోలీసుల రక్షణలోనే టీడీపీ నేతలు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, రాష్ట్రంలో ప్రజలే ఆయుధాలు పట్టుకోవాల్సిన పరిస్థితి వస్తోందని హెచ్చరించారు. అప్పిరెడ్డి అక్రమ అరెస్ట్‌ను ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. మరోవైపు, బ్యాలెట్ బాక్స్‌ను దొంగిలించాలని చూసిన పోలింగ్ అధికారిని (పీవో) వెంటనే సస్పెండ్ చేయాలని ఎమ్మెల్సీ అప్పిరెడ్డి డిమాండ్ చేశారు. ఏలేశ్వరంలో సైకిల్ గుర్తుపై గుద్దిన బ్యాలెట్లను అధికారులే కలిపేశారని ఆయన ఆరోపించారు. ఈ ఘటనలతో గుంటూరు జిల్లాలో రాజకీయ వాతావరణం వేడెక్కింది.

పులివెందులలో వైసీపీకి మరో షాక్.. జడ్పీటీసీ స్థానాన్ని కైవసం చేసుకున్న టీడీపీ

-మొదటిపేజీ తరువాయి

వైసీపీకి దాని కంచుకోట అయిన పులివెందులలో మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అక్కడ పరాజయం పాలైన వైసీపీ... తాజాగా పరిషత్ ఎన్నికల్లోనూ ఓటమిని చవిచూసింది. ఈరోజు జరుగుతున్న ఓట్ల లెక్కింపులో పులివెందుల జడ్పీటీసీ స్థానాన్ని తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుంది.ఎపులివెందుల జడ్పీటీసీ స్థానంలో టీడీపీ అభ్యర్థి భారతి విజయం సాధించారు. ఆమె తన సమీప వైసీపీ అభ్యర్థిపై 1,463 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కొన్ని రోజుల క్రితం జరిగిన పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లోనూ టీడీపీ ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. ఇప్పుడు జడ్పీటీసీ ఎన్నికల్లోనూ అదే ఫలితం పునరావృతం కావడంతో వైసీపీ శ్రేణులు తీవ్ర నిరాశలో మునిగిపోయాయి. మున్సిపాలిటీ తర్వాత ఇప్పుడు పరిషత్ ఎన్నికల్లోనూ విజయం సాధించడంతో పులివెందుల టీడీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. పార్టీ నేతలు, కార్యకర్తలు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. వరుస విజయాలతో టీడీపీ శ్రేణుల్లో జోష్ కనిపిస్తోంది.

తిరుపతి కౌంటింగ్ కేంద్రంలో టెన్షన్.. ఒకేచోట పులివర్తి నాని, చెవిరెడ్డి భాస్కరరెడ్డి కుటుంబాలు

-తిరుపతి రూరల్ జడ్పీటీసీ టీడీపీ అభ్యర్థిగా ధనలక్ష్మి.. వైసీపీ అభ్యర్థిగా చెవిరెడ్డి కుమారుడు

-ఈ క్రమంలో కౌంటింగ్ కేంద్రానికి వచ్చిన నాని, చెవిరెడ్డి కుటుంబాలు

-ఇరు వర్గాలు ఒకే చోట ఉండటంతో వేడెక్కిన వాతావరణం

-రాష్ట్రవ్యాప్తంగా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుండగా, తిరుపతిలోని కౌంటింగ్ కేంద్రంలో ఒక ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. రాజకీయ ప్రత్యర్థులైన టీడీపీ ఎమ్మెల్యే

-పులివర్తి నాని, వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి కుటుంబాలు ఒకే కేంద్రానికి చేరుకోవడం స్థానికంగా ఉత్కంఠ రేపింది.

వివరాల్లోకి వెళితే, తిరుపతి రూరల్ జడ్పీటీసీ స్థానానికి వైసీపీ తరఫున చెవిరెడ్డి భాస్కరరెడ్డి తనయుడు హర్షిత్ రెడ్డి పోటీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఓట్ల లెక్కింపును పర్యవేక్షించేందుకు చెవిరెడ్డి తన భార్యతో కలిసి కౌంటింగ్ కేంద్రానికి వచ్చారు. అదే సమయంలో, ఇదే స్థానం నుంచి టీడీపీ అభ్యర్థి ధనలక్ష్మి తరఫున పులివర్తి నాని తన భార్య సుధారెడ్డితో కలిసి అక్కడికి చేరుకున్నారు. దీంతో ఇరు వర్గాలు ఒకేచోట ఉండటంతో వాతావరణం కాస్త వేడెక్కింది. ఇటీవల పోలింగ్ రోజున పులివర్తి నాని భార్య సుధారెడ్డి, చెవిరెడ్డి మధ్య జరిగిన సంభాషణకు సంబంధించిన వీడియో వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఘర్షణలు జరగకుండా ఉండేందుకు “అన్నా.. ఇద్దరం ఒకే కారులో వెళ్దాం” అని సుధారెడ్డి ప్రతిపాదించడం, దానికి చెవిరెడ్డి మౌనంగా ఉండిపోవడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలోని పరిణామాల తర్వాత, ఇప్పుడు ఓట్ల లెక్కింపు కోసం ఇరు కుటుంబాలు ఒకే కేంద్రంలో ఉండటంతో స్థానికంగా ఇది



మరోసారి చర్చకు దారితీసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేసి, పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

సీసీటీవీల పర్యవేక్షణలో కౌంటింగ్.. సాయంత్రం 4 గంటలకల్లా ఫలితాలు వచ్చే అవకాశం: ఎస్ఈసీ పునేఠా

-నాగార్జున యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన పునేఠా

-కౌంటింగ్ పారదర్శకంగా జరుగుతోందని వెల్లడి

-అన్ని పార్టీల ఏజెంట్లు సంతృప్తిని వ్యక్తం చేశారన్న ఎస్ఈసీ

ఆంధ్రప్రదేశ్‌లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోంది. సాయంత్రం 4 గంటల కల్లా తుది ఫలితాలు వెలువడే అవకాశం ఉందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని ఆయన సందర్శించి, ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందని స్పష్టం చేశారు. మొత్తం ప్రక్రియను సీసీటీవీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నామని, ఏజెంట్ల సమక్షంలోనే బ్యాలెట్ బాక్సులను తెరిచామని వివరించారు. ఓట్ల లెక్కింపు చాలా బాగా జరుగుతోందని ఏజెంట్లు సంతృప్తి వ్యక్తం చేశారని ఆయన పేర్కొన్నారు. నీసీ కెమెరాల ఫుటేజ్‌ను 60 రోజుల పాటు భద్రపరుస్తామని, ఏవైనా కోర్టు కేసులు ఉంటే మరింత ఎక్కువ కాలం భద్రపరుస్తామని తెలిపారు. పల్నాడు జిల్లా కంకణాలవల్లి గ్రామస్థులు తమకు రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వద్దని, ఫ్లైఓవర్ వేయాలని కోరుతూ బ్యాలెట్ బాక్సులో కరపత్రాలు వేశారు. దీనిపై మీడియా అడిగిన ప్రశ్నకు బదులుగా... అది స్థానిక జిల్లా యంత్రాంగం పరిధిలోని అంశమని సమాధానమిచ్చారు. అలాగే, రిగ్గింగ్ జరిగిందని జిల్లా కలెక్టర్ నివేదిక ఇస్తేనే రీపోలింగ్ నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తామని పునేఠా స్పష్టం చేశారు. పరిషత్ ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే, త్వరలోనే రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలను కూడా నిర్వహిస్తామని ఈ సందర్భంగా వెల్లడించారు.



కౌంటింగ్ వేళ.. వైసీపీ నేత బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి హౌస్ అరెస్ట్

-ఏపీలో కొనసాగుతున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు

-అవాంఛనీయ ఘటనల నివారణకు పోలీసుల భారీ బందోబస్తు

-కర్నూలులో వైసీపీ నేత బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి హౌస్ అరెస్ట్

-నందికొట్కూరు కౌంటింగ్ కేంద్రానికి వెళ్తుండగా గృహ నిర్బంధం

ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోంది. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో ముందుజాగ్రత్త చర్యగా కర్నూలు జిల్లాకు చెందిన వైసీపీ నేత బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డిని పోలీసులు గృహ నిర్బంధం చేశారు. నందికొట్కూరులోని ఎన్నికల కౌంటింగ్ కేంద్రానికి వెళ్లేందుకు సిద్ధార్థ్ రెడ్డి తన ఇంటి నుంచి బయలుదేరారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు భారీగా ఆయన ఇంటి వద్దకు చేరుకున్నారు. ఆయన బయటకు రాగానే అడ్డుకుని, హౌస్ అరెస్ట్ చేస్తున్నట్లు తెలిపారు. దీంతో ఆయన ఇంటి వద్ద స్వల్ప ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పరిషత్ ఎన్నికల పోలింగ్ జరిగిన రోజున కూడా శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డిని గృహ నిర్బంధం చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు కౌంటింగ్ సందర్భంగా కూడా ఎలాంటి ఘర్షణలకు ఆస్కారం ఉండకూడదనే ఉద్దేశంతో పోలీసులు ఈ చర్యలు



తీసుకున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, కీలక నేతలను కౌంటింగ్ కేంద్రాల వద్దకు రాకుండా కట్టడి చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడా స్వల్ప ఉద్రిక్తతలు మినహా ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగానే సాగుతోంది.

నూతన భవన నిర్మాణానికి కొమెర హరినాథ్ రూ.20 వేల విరాళం

-సేవా కార్యక్రమాలకు దాతల సహకారం అభినందనీయం

-- సేవాసమితి అధ్యక్షులు రాజు

పులివెందుల,కదిలించే వార్త నవంబర్ 7:

పులివెందుల పట్టణంలో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు స్నేహిత అమృత హస్తం సేవాసమితి చేపట్టిన నూతన భవన నిర్మాణానికి దాతల నుంచి సహకారం అందుతోంది. ఇందులో భాగంగా పులివెందుల పట్టణం కడప రోడ్డులోని హనుమాన్ నగర్‌కు చెందిన వ్యాపారవేత్త కొమెర హరినాథ్ శనివారం రూ.20,000 (ఇరవై వేల రూపాయలు) విరాళంగా అందజేశారు. సేవాసమితి ఆధ్వర్యంలో జగనన్న కాలనీకి వెళ్లే 100 అడుగుల రోడ్ మార్గంలో నిర్మిస్తున్న నూతన భవనం భవిష్యత్తులో అనేక సామాజిక సేవా కార్యక్రమాలకు కేంద్రంగా నిలవనుంది. ఈ భవనం ద్వారా ఉచిత విద్యా కార్యక్రమాలు, నేత్రదాన అవగాహనా కార్యక్రమాలు, నేత్రదాన సేకరణ కేంద్రం, నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ, మహిళలకు, యువత కు స్వయం ఉపాధి శిక్షణ వంటి వలు సేవా కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ సందర్భంగా సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ.. సమాజ సేవే లక్ష్యంగా సేవాసమితి చేపట్టిన నూతన భవన నిర్మాణానికి కొమెర హరినాథ్ అందించిన రూ.20 వేల ఆర్థిక సహాయం ఎంతో విలువైనదని తెలిపారు. సేవా కార్యక్రమాల కోసం ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందిస్తున్న దాతలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల నిర్వహణకు సొంత భవనం ఎంతో అవసరమని, ఈ నిర్మాణం పూర్తయితే మరిన్ని సేవా కార్యక్రమాలను నిరంతరాయంగా ప్రజలకు చేరువ చేయడానికి



అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. దాతలు, సేవాభిమానులు తమకు తోచిన విధంగా సహకరించి ఈ బృహత్తర సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని రాజు విజ్ఞప్తి చేశారు. సేవా సంకల్పంతో ముందుకు సాగుతున్న స్నేహిత అమృత హస్తం సేవాసమితికి కొమెర హరినాథ్ అందించిన విరాళం మరింత ప్రోత్సాహాన్ని అందించనుంది.

కమల్ అమృత్ వాణి-309



నిర్ణయే పక్షపాతో హి న్యాయమార్గస్య దూషణమ్।
ఉభయోఃపక్షమాకర్ణ్య సమదృష్టిం సమాచరేత్॥
తాత్పర్యం. ఏదైనా సమస్యపై నిర్ణయం తీసుకునేటప్పుడు పక్షపాతం చూపకూడదు.మనకు ఇష్టమైన వ్యక్తి చెప్పిందే నిజమని భావించడం న్యాయబద్ధమైన ఆలోచన కాదు.ఒక సంఘటనకు సంబంధించిన అన్ని వైపుల విషయాలను తెలుసుకోవాలి. ఇరుపక్షాల వాదనలను ఓపికగా విన్న తర్వాతే నిర్ణయానికి రావాలి.వ్యక్తిగత పరిచయాలు, బంధుత్వాలు, అభిమానాలు నిర్ణయాన్ని ప్రభావితం చేయకూడదు.నిజానిజాలను పరిశీలించి న్యాయమైన తీర్పు ఇవ్వడం బాధ్యతాయుతమైన లక్షణం.తప్పు చేసినవారు మనవారైనా,పరవారైనా.. సరైన విషయాన్ని సమర్థించగలగాలి. నిష్పక్షపాతంగా వ్యవహరించే వ్యక్తిపై అందరికీ విశ్వాసం ఏర్పడుతుంది. న్యాయం అనేది మనకు అనుకూలంగా ఉండటం కాదు; అందరికీ సమానంగా వర్తించడం.

✍ కమలేకర్ నాగేశ్వర్ రావు 'కమల్'

ముగిసిన భాగవత సప్తహ పఠనం

లింగాల కదిలించే వార్త నవంబర్ 7

లింగాల మండలం రామనూత్నపల్లి శ్రీ సీతారాముల ఆలయం లో శని వారం చివరి ముగిసిన భాగవతసప్తహ పఠనం. పఠనం అనంతరం మంత్రపుష్పం ఆలయం చుట్టూ మహిళల చే కలశ ప్రదర్శనం జరిగింది. చివరిగా భాగవత పండితులకు సన్మాన కార్యక్రమం నిర్వ హించారు. పులివెందుల భాగవత భక్త సమాజం నిర్వ హన లో దాతల సహ కారం లతో దిగ్విజయ వంతంగా ముగిసిన పఠనం కార్యక్రమం లో. సమాజం అధ్యక్షులు చిన్నశివా



రెడ్డి ఉపాధ్యక్షులు పాపిరెడ్డి సలహా దారులు గొందిపల్లి నారాయణరెడ్డి రంగ నాథం,గంగిరెడ్డి తొండూరు నారాయణ రెడ్డి



మీడియా కన్వీనర్ బాల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు

ప్లాస్టిక్ వ్యర్థాలతో అద్భుత సమూనాలు

-ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

-బ్రిక్స్ సుస్థిర జీవనశైలి ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషశ్రీ

వేంపల్లె నవంబర్ 7 (కదిలించే వార్త):

ప్లాస్టిక్ వ్యర్థాలను సృజనాత్మకంగా వినియోగిస్తూ అద్భుతమైన సమూనాలను తయారు చేయవచ్చని వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ కె. ఉషశ్రీ పేర్కొన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందడుగు వేయాలని విద్యార్థులకు పిలుపు నిచ్చారు.వేంపల్లిలోని వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శనివారం బ్రిక్స్ సుస్థిర జీవనశైలి ముగింపు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులకు అవగాహన సదస్సుతో పాటు భారీ ప్రదర్శన ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ఉషశ్రీ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వ్యర్థాలను నిరుపయోగంగా పారవేయకుండా వాటితో ఉపయోగకరమైన, ఆకర్షణీయమైన వస్తువులను తయారు చేయవచ్చని వివరించారు. విద్యార్థులతో



ప్లాస్టిక్ వ్యర్థాల ద్వారా పలు సమూనాలను తయారు చేయించి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.అనంతరం మేడం క్యూరీ జయంతిని పురస్కరించుకుని విజ్ఞాన శాస్త్ర రంగంలో ఆమె అందించిన సేవలను, సర్ సి.వి. రామన్ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. శాస్త్రవేత్తల కృషి, ఆవిష్కరణలు సమాజ అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో జాతీయ సేవా వధకం మొదటి విభాగ కార్యక్రమ అధికారి ఎ. కుమార్ రాజా, రెండవ విభాగ కార్యక్రమ అధికారి కె. జనార్ధన, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ కూటమి అభ్యర్థి యమ్మనూరు సరళాదేవి ఘన విజయం

-విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపిన సరళాదేవి

లింగాల కదిలించే వార్త నవంబర్ 7

పులివెందుల నియోజకవర్గం లింగాల మండల జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి యమ్మనూరు సరళాదేవి ఘన విజయం సాధించగా సహకరించిన ప్రతి ఒక్కరికి ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి ప్రభుత్వ హవా కొనసాగగా అదే జోరును అధినేత జగన్మోహన్ రెడ్డి సొంత నియోజకవర్గం లింగాల మండల జడ్పీటిసి ఎన్నిక ఆది నుండి హోరాహోరీగా కొనసాగగా కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన ఎమ్మనూరు సరళాదేవి కి పదివేల 148 ఓట్లు పోలవగా తన సమీప ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి పెద్దమల్లు శ్రీదేవి 8 598 ఓట్లు సాధించి రెండవ స్థానంలో నిలువగా, యమ్మనూరు సరళాదేవి దేవి 1568 ఓట్ల మెజారిటీతో విజయం సాధించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి పేర్కొని డెకరేషన్ ఫారం అందించారు. ఈ విజయంతో కూటమి నాయకులు, కార్యకర్తల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. ఈ సందర్భంగా సరళా దేవి మాట్లాడుతూ ఈ విజయాన్ని అందించిన ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలియజేస్తూ, కూటమి ప్రభుత్వం తమ రెండేళ్ల కాలంలో అందించిన సంక్షేమం మరియు అభివృద్ధి ఫలాలే తమ విజయానికి బాటవేశాయని పేర్కొంటూ తమకు ఈ అవకాశం కల్పించిన అధినేత చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ బాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, అదేవిధంగా మా విజయాలకు వెన్నంటి ప్రోత్సహించిన పులివెందుల టిడిపి ఇన్చార్జ్ బీటెక్ రవి, మాజీ జెడ్పీటిసి మా రెడ్డి లతా రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, దేవి రెడ్డి సంజీవరెడ్డి మరియు జోగి రెడ్డి అదేవిధంగా కార్యకర్తలకు మరియు ప్రజానీకానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నేత విశ్వనాథరెడ్డి, పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గద్దం అమర్నాథ్ మరియు ఇతర వైకాపా నేతలు తదితరులు




పాల్గొన్నారు.

ఈ విజయం నాది కాదు, కార్యకర్తలది"


-వేముల జెడ్పీటీసీగా నాగేళ్ల సత్య ప్రభావతమ్మ ఘన విజయంలి

వేముల కదిలించే వార్త నవంబర్ 07:

వేముల మండల జెడ్పీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నాగేళ్ల సత్య ప్రభావతి ఘన విజయం సాధించారు. ప్రత్యర్థి బొగ్గుల విజయలక్ష్మిపై 1569 ఓట్ల భారీ మెజారిటీతో గెలిచి వేముల మండలంలో ఫ్యాన్ జెండా ఎగురవేము ఫలితం వెలువడగానే వేముల మండల వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచుకున్నారు. సత్య ప్రభావతమ్మకు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా సత్య ప్రభావతమ్మ మాట్లాడుతూ "ఈ విజయం నాది కాదు, కార్యకర్తలది" అని అన్నారు. తన విజయానికి కారణమైన వేముల మండల ప్రజలకు, అహర్నిశలు కష్టపడిన ప్రతి కార్యకర్తకు



కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ విజయోత్సవంలో మండల వైకాపా



కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి, మాజీ జెడ్పీటీసీ కొకటం వెంకట బయపురెడ్డి, పీసీబీ మాజీ డైరెక్టర్ మరకా శివకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ చల్లా వెంకటనారాయణ, వేముల మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శాశ్వత అన్నదానానికి రూ.లక్ష విరాళం

-గండి అంజన్న దేవస్థానానికి వేంపల్లె దంపతుల చేయూత

-దాతలను శాలువాతో సత్కరించిన ఆలయ చైర్మన్

గండి నవంబర్ 7(కదిలించే వార్త):

గండి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి వేంపల్లె మండలానికి చెందిన దంపతులు రూ.లక్ష విరాళంగా అందజేశారు. వేంపల్లెకు చెందిన దేవర్ల శ్రీనివాసులు రెడ్డి, ఆయన సతీమణి తేజోవతి దంపతులు భక్తులకు నిరంతరం అన్నప్రసాదం అందించాలనే సత్సంకల్పంతో ఈ విరాళాన్ని సమర్పించారు.ఈ మేరకు రూ.లక్ష చెక్కును ఆలయ చైర్మన్ కల్లూరి వెంకటస్వామికి అందజేశారు. ఈ సందర్భంగా దాతలైన శ్రీనివాసులు రెడ్డి, తేజోవతి దంపతులను ఆలయ చైర్మన్ శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా చైర్మన్ కల్లూరి వెంకటస్వామి మాట్లాడుతూ శాశ్వత నిత్యాన్నదాన పథకానికి భక్తులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి విరాళాలు అందించడం అభినందనీయమన్నారు. దాతల స్ఫూర్తితో మరింత మంది భక్తులు ముందుకొచ్చి దేవస్థానంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి తమ వంతు సహకారం అందించాలని కోరారు.



అన్నదాన సేవలో భాగస్వాములై శ్రీ వీరాంజనేయ స్వామివారి కృపకు పాత్రులు కావాలని పిలుపునిచ్చారు.

తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్

-నాయకుడు భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలు

పులివెందుల కదిలించే వార్త నవంబర్ 7



తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ నియోజకవర్గ అధికార ప్రతినిధి నల్లగారి భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలు నగిరి గుట్టలో శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. స్థానిక కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు ఆయన అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ వేడుకను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమ ప్రాంగణానికి చేరుకున్న భాస్కర్ రెడ్డికి కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక కేక్‌ను ఆయన కట్ చేసి, అక్కడికి విచ్చేసిన నాయకులకు, అభిమానులకు తినిపించారు. ఈ సందర్భంగా కూటమి ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు భాస్కర్ రెడ్డికి పుట్టినరోజు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.నిరంతరం ప్రజా సమస్యలపై స్పందిస్తూ, కార్మిక శ్రేణుల సంక్షేమం కోసం పాటుపడుతున్న భాస్కర్ రెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి ముఖ్య నేతలతో పాటు భారీ సంఖ్యలో యువత, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు

ఆంజనేయునికి విశేష పూజలు

సింహాద్రిపురం కదిలించే వార్త నవంబర్ 7



సింహాద్రిపురం గ్రామంలో అతి పురాతనమైన ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ ఆచార్య ఆధ్వర్యంలో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వేకువజామునే స్వామివారికి పంచామృత అభిషేకం సహస్రనామార్చన అష్టోత్తర శతనామావళి ఆకు పూజ తదితర పూజ కైకర్యాల అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి శనివారం ,మంగళవారం భక్తులు మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని విశేష పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించి పూజలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఆలయ నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు జరిగినా జడ్పిటిసి స్థానాల్లో వైకాపా కి మెజారిటీ ఓట్లు

-రెండు జెడ్పిటిసి స్థానాల విజయం కార్యకర్తల విజయం

-జిల్లా ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి

పులివెందుల కదిలించే వార్త నవంబర్ 7



పులివెందుల నియోజకవర్గ పరిధిలో ఎన్నికలు జరిగినా నాలుగు జడ్పిటిసి స్థానాల్లో వైసీపీకే మెజారిటీ ఓట్లు లభించాయని, వివత్కర ఎదు ర్కొన్నప్పటికీ రెండు జెడ్పిటిసి స్థానాల విజయం కార్యకర్తల విజయమని జిల్లా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. పులివెందుల నియోజకవర్గ పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని అధికార ప్రభుత్వం అన్ని విధాలుగా పోలీస్ వ్యవస్థను సమన్వయపరచుకుని యదేచ్ఛగా రిగ్గింగులకు పాల్పడి నప్పటికీ నియోజవర్గ పరిధిలో రెండు జెడ్పిటిసి స్థానాలను వైసీపీ గెలుచుకోవడం ఆశాజనకమని, ఎన్నికల ప్రక్రియను కూటమి ప్రభుత్వం అవహస్యం చేస్తూ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలలో రిగ్గింగ్ కు పాల్పడ్డారని వేంపల్లి మండలంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ సందర్భంగా ఆ స్థానాన్ని వైసీపీ గెలుచుకుందని ఎంపీ అవినాష్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పై నియోజకవర్గ ప్రజలు మరోసారి తన అభిమానాన్ని చాటుకున్నారని ఎంపీటీసీ మరియు జడ్పీటీసీ ఎన్నికల్లో పెద్ద ఎత్తున రిగ్గింగ్ జరిగాయని నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని పోలింగ్ బూతుల్లోకి వైసిపి ఏజెంట్లను వెళ్లకుండా చేశారని అయినప్పటికీ స్థానిక సంస్థ ఎన్నికలలో వైసీపీకే మెజార్టీ ఓట్లు పోల్ అయ్యాయి అన్నది నిజమని తెలియజేస్తూ విజయనందించిన కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

వేముల జడ్పిటిసి స్థానంలో వైకాపా విజయం

-పార్టీ శ్రేణుల సమిష్టి కృషి ఫలితమే

-నాగేళ్ల సత్య ప్రభావతమ్మ

వేముల కదిలించే వార్త నవంబర్ 7



పులివెందుల నియోజకవర్గ పరిధిలోని వేముల మండల జడ్పిటిసి ఎన్నికల్లో వైకాపా పార్టీ అభ్యర్థి నాగేళ్ల సత్యప్రభావతమ్మ విజయం సాధించారు. స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని నియోజకవర్గ పరిధిలో హోరాహోరీగా సాగినటువంటి ఎన్నికల ప్రచారం అనంతరం ఎన్నికల నిర్వహణ సందర్భంగా అనేక అలజడులు చోటు చేసుకున్నప్పటికీ శనివారం ఉత్కంఠ భరిత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ కొనసాగగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి 9040 ఓట్లు నమోదు కాగా, కూటమి అభ్యర్థికి 7471 నమోద కూటమి అభ్యర్థి బొగ్గుల విజయలక్ష్మిపై 1569 ఓట్ల మెజారిటీతో విజయం సాధించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ధ్రువీకరించి డిక్లరేషన్ ఫారం అందించారు. మొత్తం మీద నియోజకవర్గ పరిధిలో వేముల మండలంలో వైకాపా తన స్థానాన్ని నిలబెట్టుకుంటూ విజయం సాధించడం వట్ల వైసీపీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లువిరిసి విజయోత్సవాలు నిర్వహించుకుని సత్య ప్రభావతమ్మకి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సత్య ప్రభావతమ్మ మాట్లాడుతూ అవకాశం ఇచ్చిన అధినేత జగన్మోహన్ రెడ్డి ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మరియు ఆదరించిన ప్రజానీకానికి ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

659 జడ్పీటీసీలు.. 9,821 ఎంపీటీలకు కౌంటింగ్.. పార్టీల వారీగా పూర్తి వివరాలు

-ఏపీలో కొనసాగుతున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఓట్ల లెక్కింపు
-భారీ బందోబస్తు మధ్య ఉదయం 8 గంటలకు ప్రారంభమైన కౌంటింగ్
-77 జడ్పీటీసీలు ఇప్పటికే ఏకగ్రీవం

నవంబర్ 7 (కదిలించే వార్త):

ఆంధ్రప్రదేశ్‌లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఈ ఉదయం ప్రారంభమైంది. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ మొదలు కాగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ భద్రతను ఏర్పాటు చేశారు. పోలింగ్ సందర్భంగా కొన్ని చోట్ల హింసాత్మక ఘటనలు జరిగిన నేపథ్యంలో పటిష్ఠమైన చర్యలు చేపట్టారు. సాయంత్రం నాటికి పూర్తి ఫలితాలు వెలువడే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 659 జడ్పీటీసీ స్థానాలు ఉండగా, వీటిలో ఇప్పటికే 77 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 582 స్థానాలకు ఎన్నికలు జరగ్గా, 2,169 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వీరిలో వైసీపీ నుంచి 574 మంది, టీడీపీ నుంచి 452 మంది, జనసేన నుంచి 109 మంది, బీజేపీ నుంచి 34 మంది బరిలో ఉన్నారు. ఇతర పార్టీలు, స్వతంత్రులు వెయ్యి మంది పోటీ చేశారు. అదేవిధంగా, రాష్ట్రంలోని 9,821 ఎంపీటీసీ స్థానాలకు గాను 2,051 స్థానాలు ఏకగ్రీవం కాగా, 3 స్థానాలకు నామినేషన్లు దాఖలు కాలేదు. దీంతో 7,767 స్థానాలకు పోలింగ్ నిర్వహించగా, 18,844



మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో టీడీపీ నుంచి 6,342 మంది, వైసీపీ నుంచి 7,622 మంది, జనసేన నుంచి 1,499 మంది, బీజేపీ నుంచి 280 మంది ఉన్నారు. ఇతర పార్టీలు, స్వతంత్రులు 3,101 మంది పోటీ చేశారు. ఈనాటి ఫలితాలతో వేలాది మంది అభ్యర్థుల భవితవ్యం తేలిపోనుంది.

ఓట్ల లెక్కింపునకు ముందే విషాదం.. జనసేన ఎంపీటీసీ అభ్యర్థి దివ్య మృతి

-తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలంలో విషాదం
-అనారోగ్యంతో నిన్న కన్నుమూసిన దివ్య
-జనసేనలో క్రియాశీలంగా పని చేస్తున్న దివ్య, ఆమె భర్త శ్రీనివాస్

నవంబర్ 7 (కదిలించే వార్త):

తూర్పుగోదావరి జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఒకరోజు ముందు జనసేన పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి అనారోగ్యంతో కన్నుమూశారు. దేవరపల్లి మండలం ధుమంతునిగూడేనికి చెందిన గారపాటి దివ్య (26) శుక్రవారం రాజమండ్రిలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. వివరాల్లోకి వెళితే, ధుమంతునిగూడెం ఎంపీటీసీ స్థానం నుంచి జనసేన తరఫున దివ్య పోటీ చేశారు. గురువారం పోలింగ్ ముగిసిన తర్వాత ఆమె అస్వస్థతకు గురయ్యారు. గ్యాస్ట్రిక్ సమస్య తలెత్తడంతో కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం రాజమండ్రిలోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం రాత్రికి ఆమెను ఇంటికి తీసుకువచ్చారు. అయితే, నిన్న ఉదయం ఆమె ఆరోగ్యం మళ్లీ విషమించడంతో తిరిగి అదే ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దివ్య, ఆమె భర్త శ్రీనివాస్ జనసేనలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. దివ్యకు నాలుగు నెలల బాబుతో పాటు మరో కుమారుడు కూడా ఉన్నాడు. ఈరోజు ఓట్ల లెక్కింపు జరుగుతున్న తరుణంలో దివ్య హఠాన్మరణంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



మురసు తుఫాన్ నష్టంపై సీఎం చంద్రబాబు సమీక్ష.. రేపటిలాగా నిత్యావసరాల పంపిణీ పూర్తి చేయాలని ఆదేశం

-ఈ నెల 9లోగా పంట నష్టం అంచనాలు పూర్తి
-ఉద్యాన పంటల నష్టం అంచనాలు 92 శాతం పూర్తి
-తుపాను ప్రభావిత 1,825 గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులు
-ఇప్పటివరకు 3.82 లక్షల కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ
-రైతుబజార్లలో కిలో ఉల్లిపాయలు రూ.35కే విక్రయం
-రేషన్ దుకాణాల్లో తక్కువ ధరలకు పామాయిల్, కందిపప్పు, గోధుమ పిండి

నవంబర్ 7 (కదిలించే వార్త):

మురసు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు, విద్యుత్ పునరుద్ధరణ, పంట నష్టం అంచనాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. శనివారం క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్, రెవెన్యూ, విద్యుత్, వ్యవసాయ తదితర శాఖల ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. తుపాను బాధితులకు నిత్యావసర సరకుల పంపిణీ, తక్షణ ఆర్థిక సాయం అందించే ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పంట నష్టం అంచనాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. దెబ్బతిన్న ఉద్యాన పంటలకు సంబంధించి 92 శాతం నష్టం అంచనాలు పూర్తయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. వ్యవసాయ పంటల నష్టాల అంచనా ఈ నెల 9వ తేదీ నాటికి పూర్తవుతుందని తెలిపారు. గతంలో వచ్చిన అర్నాబ్ తుపాను కారణంగా సుమారు 30 వేల విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని, అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు వెల్లడించారు. మురసు తుపాను ప్రభావిత 1,825 గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టగా.. ఇప్పటివరకు 7,850 దెబ్బతిన్న స్తంభాలను బాగు చేసినట్లు తెలిపారు. తుపాను బాధితులకు నిత్యావసర సరకుల పంపిణీ కొనసాగుతోందని పౌరసరఫరాల శాఖ అధికారులు చెప్పారు. ఇప్పటివరకు 3.82 లక్షల కుటుంబాలకు సరకులు అందించినట్లు వెల్లడించారు. ఆదివారం నాటికి పంపిణీని పూర్తిచేస్తామని సీఎంకు తెలిపారు. మరోవైపు బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరకుల ధరలను నియంత్రించేందుకు తీసుకుంటున్న చర్యలపైనా చంద్రబాబు ఆరా తీశారు. ఉల్లిపాయలు, బియ్యం, పామాయిల్, గోధుమ పిండి, కందిపప్పు ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. రైతుబజార్ల ద్వారా కిలో ఉల్లిపాయలను రూ.35కే విక్రయిస్తున్నామని అధికారులు తెలిపారు. ఇందుకోసం 8 వేల క్వింటాళ్ల ఉల్లిపాయలను మార్కెట్‌లోకి తీసుకొచ్చినట్లు వివరించారు. బియ్యం ధరల నియంత్రణకు మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులతో చర్చలు జరిపినట్లు అధికారులు చెప్పారు. బహిరంగ మార్కెట్‌లో బీపీటీ సోనా, సాంబ, కేఎన్ఎం రకాల బియ్యాన్ని కిలో రూ.66కు, హెచ్ఎంటీ, ఆర్ఎన్ఆర్ రకాలను రూ.76కు, జై శ్రీరామ్ రకాన్ని రూ.82కు, సాధారణ రకం బియ్యాన్ని రూ.47కు విక్రయించేందుకు వ్యాపారులు అంగీకరించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించిన 204 మంది వ్యాపారులపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ధరణి బ్రాండ్ బియ్యాన్ని రైతుబజార్లలో అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు అధికారులు తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.70 వలుకుతున్న బియ్యాన్ని రైతుబజార్లలో రూ.50కే విక్రయిస్తున్నామని చెప్పారు. బీపీటీ రకం బియ్యాన్ని కిలో రూ.49కు అందిస్తున్నట్లు



వివరించారు. ఇప్పటివరకు 150 కౌంటర్ల ద్వారా 27,430 క్వింటాళ్ల బియ్యాన్ని విక్రయించగా.. 1.03 లక్షల కుటుంబాలు కొనుగోలు చేసినట్లు తెలిపారు. రేషన్ దుకాణాల ద్వారా లీటరు పామాయిల్ రూ.125కు, కిలో కందిపప్పు రూ.100కు, గోధుమ పిండి రూ.25కు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మురసు తుపాను: ఏపీకి తక్షణ సాయం అందించండి.. కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖ

- మధ్యంతర ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి
-ప్రాథమిక అంచనాల ప్రకారం రూ. 1,919 కోట్ల నష్టం
-వారం రోజుల వ్యవధిలోనే రెండు తుపానులతో తీవ్ర నష్టం
-వ్యవసాయ, ఉద్యాన పంటలకు భారీ నష్టం వాటిల్లినట్లు వెల్లడి

నవంబర్ 7 (కదిలించే వార్త):

'మురసు' తుపాను ధాటికి అతలాకుతలమైన ఆంధ్రప్రదేశ్‌కు తక్షణమే మధ్యంతర ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. వారం రోజుల వ్యవధిలోనే రాష్ట్రాన్ని రెండు తుపానులు చుట్టుముట్టడంపై ఆయన తన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. అక్టోబర్ 27న సంభవించిన 'అర్నాబ్' తుపాను ప్రభావం నుంచి రాష్ట్రం కోలుకోకముందే, 'మురసు' తుపాను రూపంలో మరో విపత్తు విరుచుకుపడిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల వల్ల విద్యుత్ నెట్‌వర్క్, రహదారులు సహా మౌలిక సదుపాయాలు అస్తవ్యస్తమయ్యాయని వివరించారు. ఒకే సీజన్‌లో రెండుసార్లు ప్రకృతి వైపరీత్యాలు సంభవించడంతో రైతులు, మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారని ఆయన తెలిపారు. 'మురసు' తుపాను కారణంగా రాష్ట్రానికి ప్రాథమికంగా రూ. 1,919.59 కోట్ల మేర నష్టం వాటిల్లిందని అంచనా వేసినట్లు చంద్రబాబు తన లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,43,122 హెక్టార్లలో వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లగా, దీని విలువ సుమారు రూ. 874.96 కోట్లుగా ఉండవచ్చని తెలిపారు. అదేవిధంగా, 6,504 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతినడంతో రూ. 337.10 కోట్ల నష్టం వాటిల్లిందని వివరించారు. వీటితో పాటు పశుసంవర్ధక, ఆక్వాకల్చర్, గృహనిర్మాణం, విద్యుత్, పంచాయతీరాజ్, విద్యా, ఆరోగ్య రంగాలు సైతం భారీగా ప్రభావితమయ్యాయని వెల్లడించారు. వరద నీరు తగ్గుముఖం పట్టగానే నష్టానికి సంబంధించి పూర్తిస్థాయి అంచనాలను రూపొందించి, 15 రోజుల్లోగా కేంద్రానికి సమగ్ర నివేదిక



సమర్పిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. నష్టపోయిన రైతులు, మత్స్యకారులు, బాధితులను ఆదుకోవడంతో పాటు, దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను పునరుద్ధరించేందుకు తక్షణమే మధ్యంతర ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

సింహాచలంలో సంప్రదాయ దుస్తులు తప్పనిసరి.. ఈవో కీలక ప్రకటన

-సింహాచలం ఆలయంలో కొత్త డ్రెస్ కోడ్ అమలు
-నిక్కర్లు, టీ షర్టులు ధరిస్తే ఆలయంలోకి అనుమతి లేదన్న ఈవో
-ఆలయ పవిత్రత కోసమే ఈ నిర్ణయమన్న ఈవో
-నరక చతుర్దశి రోజున సాయంత్రం 6 గంటల వరకే దర్శనం

నవంబర్ 7 (కదిలించే వార్త):

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో భక్తులకు నూతన వస్త్ర నిబంధనలు (డ్రెస్‌కోడ్) అమల్లోకి వచ్చాయి. ఆలయానికి వచ్చే భక్తులు ఇకపై తప్పనిసరిగా సంప్రదాయ దుస్తుల్లోనే రావాలని దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) జల్లేపల్లి వెంకట్రావు స్పష్టం చేశారు. నూతన నిబంధనల ప్రకారం, పురుషులు పంచె-కండువా లేదా కుర్తా-పైజామా ధరించాలి. ఫార్మల్ ప్యాంట్, షర్ట్ ధరించిన వారిని కూడా అనుమతిస్తారు. మహిళలు చీర, లంగా- ఓణీ లేదా చుడీదార్‌తో పాటు తప్పనిసరిగా దుపట్టా ధరించాల్సి ఉంటుంది. షార్ట్స్ (నిక్కర్లు), టీ-షర్టులు, స్లీవ్‌లెస్ టాప్స్ వంటి ఆధునిక పాశ్చాత్య దుస్తులు ధరించిన వారిని ఆలయ ప్రాంగణంలోకి అనుమతించబోమని అధికారులు తేల్చిచెప్పారు. ఆర్జిత సేవల్లో పాల్గొనే భక్తులకు సైతం ఈ నిబంధనలే వర్తిస్తాయని తెలిపారు. ఆలయ పవిత్రతను కాపాడటంతో పాటు, సనాతన ధర్మ సంప్రదాయాలను పరిరక్షించే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈవో వెంకట్రావు వివరించారు. ఈ కొత్త



నిబంధనలపై భక్తులకు అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, నవంబర్ 8, ఆదివారం నరక చతుర్దశి, స్వాతి నక్షత్రం పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక హోమాలు జరగనున్నాయి. ఆ రోజున సాయంత్రం 6 గంటల వరకే భక్తులకు స్వామివారి దర్శన సౌకర్యం ఉంటుందని ఆలయ వర్గాలు వెల్లడించాయి.

వెలుగు పంచుదాం, విషం కాదు

ప్రమిదలో జ్ఞానజ్యోతి, ప్రకృతికి స్వచ్ఛమైన శ్వాస: ఇదే నిజమైన దీపావళి దీపావళి అంటే అమావాస్య చీకటిని చిరునవ్వుతో ఎదుర్కొనే పండుగ. నరకాసురుడి అహంకారం అంతమైన రోజు, లక్ష్మీదేవిని ఆహ్వానించే రాత్రి, ఇంటింటా ప్రమిదలు వెలిగే సందర్భం. కానీ ఆ వెలుగు వెనుక ఉన్న సందేశాన్ని మనం ఎంతవరకు వింటున్నాం చిన్నదైన ప్రమిదలో ఉండేది కాస్త నూనె, ఒక వత్తి. అయినా అది చీకటికి తలవంచదు. మన జీవితాలకూ అదే పాఠం. అంతరంగంలో అసూయ, ద్వేషం, అత్యాశ అనే చీకట్లు ఉన్నంతకాలం గుమ్మాలపై ఎన్ని దీపాలు వెలిగినా ప్రయోజనం లేదు. నిజమైన లక్ష్మి నివసించేది బంగారంలో కాదు, సద్బుద్ధిలో, సంతృప్తిలో, సేవాభావంలో. మరోవైపు, పండుగ రాత్రి తర్వాత నగరాలను పొగమంచులా కమ్మేసే కాలుష్యం మన కళ్లముందే ఉంది. టపాసుల హోరుకు వృద్ధుల నిద్ర చెదురుతుంది, ఆస్తమా రోగుల ఊపిరి బిగుసుకుంటుంది, మూగజీవాలు బెదిరిపోతాయి. భూమిని తల్లిగా, గాలిని ప్రాణంగా, నీటిని తీర్థంగా కొలిచే సంస్కృతి మనది. అలాంటి మనమే పంచభూతాలను బాధపెట్టి సంబరం వెతుక్కోవడం ఎంత వైరుధ్యం! పరిష్కారాలు మన చేతుల్లోనే ఉన్నాయి. మట్టి ప్రమిదలనే వాడదాం. ముగ్గులకు పూలరేకులు, �య్యప్పిండి వంటి సహజ పదార్థాలు చాలు. టపాసులకు పెట్టే ఖర్చుతో మొక్కలు నాటుదాం, అవసరంలో ఉన్నవారికి స్వీట్లు పంచుదాం. అనవసరమైన విద్యుత్ దీపాలను ఆర్పి, ఇంధనాన్ని ఆదా చేద్దాం. దైవత్వం అంటే భీకరమైన శబ్దాల హోరు కాదు, నిర్మలమైన హృదయం; ఆడంబరం కాదు, ఆత్మశుద్ధి. ఈ దీపావళికి మనసులో ఒక జ్యోతిని, పర్యావరణానికి ఒక స్వచ్ఛమైన శ్వాసను అందిద్దాం. ఆ వెలుగే రేపటి తరాలకు మనమిచ్చే నిజమైన కానుక.

కమలేకర్ నాగేశ్వర్ రావు 'కమల్'

చిత్తూరు నియోజకవర్గంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో టీడీపీ ఆధిక్యం

చిత్తూరు రూరల్ కదిలించే వార్త 7 నవంబర్

చిత్తూరు నియోజకవర్గ పరిధిలో జరిగిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భాగంగా ఇప్పటివరకు వెలువడిన ఫలితాల వివరాలు ఇలా ఉన్నాయి.

-జడ్పీటీసీ స్థానాలు:

చిత్తూరు జడ్పీటీసీ స్థానాన్ని టీడీపీ కైవసం చేసుకుంది. గుడిపాల జడ్పీటీసీ స్థానాన్ని కూడా టీడీపీ కైవసం చేసుకుంది. చిత్తూరు రూరల్ మండలం ఎంపీటీసీ స్థానాలు: తాళంబేడు -- టీడీపీ తుమ్మింద -- టీడీపీ నంతాపురం -- టీడీపీ ముట్టుకోరు -- టీడీపీ పచ్చనపల్లి -- వైఎస్ఆర్‌సీపీ గుడిపాల మండలం ఎంపీటీసీ స్థానాలు: గుడిపాల -- టీడీపీ కొత్తపల్లి (189) -- వైఎస్ఆర్‌సీపీ రామాపురం (197) -- టీడీపీ బసవపల్లె -- టీడీపీ చీలాపల్లె -- టీడీపీ చిత్తపార -- వైఎస్ఆర్‌సీపీ మరకలకుప్పం -- టీడీపీ నాగమంగళం -- వైఎస్ఆర్‌సీపీ నారగల్లు -- జనసేన (JSP) పానాటూరు -- వైఎస్ఆర్‌సీపీ పాపసముద్రం -- వైఎస్ఆర్‌సీపీ కౌంటింగ్ కొనసాగుతున్న స్థానం: చిత్తూరు మండలంలోని దిగువ మాసనపల్లి ఎంపీటీసీ సెగ్మెంట్‌కు సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఫలితాలు వెలువడిన అనంతరం పూర్తి వివరాలు వెల్లడించనున్నారు.

జీడీ నెల్లూరు నియోజకవర్గంలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ మధ్య హోరాహోరీ పోరు

-వెదురుకుప్పంలో వైఎస్సార్‌సీపీ హవా.. ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో విజయాలు
-ఇప్పటివరకు వెల్లడైన ఐదు జడ్పీటీసీ ఫలితాల్లో వైఎస్సార్‌సీపీకి మూడు, టీడీపీకి రెండు

చిత్తూరు రూరల్ కదిలించే వార్త 7 నవంబర్

జీడీ నెల్లూరు నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుండగా పలు స్థానాల ఫలితాలు వెల్లడయ్యాయి. నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో తెలుగుదేశం పార్టీ టీడీపీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు పలు ఎంపీటీసీ స్థానాల్లో విజయం సాధించారు. కొన్ని స్థానాల్లో భారీ మెజార్టీలు నమోదుకాగా, మరికొన్ని చోట్ల పోటీ హోరాహోరీగా సాగింది. ముఖ్యంగా వెదురుకుప్పం మండలంలో వైఎస్సార్‌సీపీ పలు ఎంపీటీసీ స్థానాలతో పాటు జడ్పీటీసీ స్థానాన్ని కూడా కైవసం చేసుకుంది. తిరుమలయ్యపల్లి ఎంపీటీసీ స్థానంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి 645 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించడం విశేషం. ఇప్పటివరకు వెల్లడైన ఐదు జడ్పీటీసీ ఫలితాల్లో పాలసముద్రం, గంగాధర నెల్లూరు స్థానాలను టీడీపీ కైవసం చేసుకోగా, కార్వేటినగరం, ఎస్.ఆర్.పురం, వెదురుకుప్పం స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించారు. దీంతో వెల్లడైన ఫలితాల్లో వైఎస్సార్‌సీపీ మూడు, టీడీపీ రెండు స్థానాలను దక్కించుకున్నాయి. మరో జడ్పీటీసీ స్థానం ఫలితం వెలువడాల్సి ఉంది.

-వెదురుకుప్పంలో వైఎస్సార్‌సీపీ ప్రభావం

వెదురుకుప్పం మండల పరిధిలోని ఆలమడుగు, జక్కిదొన, కమరగుంట, దేవరగుడిపల్లి ఎంపీటీసీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించారు. పెరుమాళ్లపల్లి ఎంపీటీసీ స్థానంలో బీజేపీ అభ్యర్థి హనుమంతరెడ్డి 274 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. నల్లవెంగనపల్లి ఎంపీటీసీ స్థానంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెంకటేష్ సమీప ప్రత్యర్థిపై 440 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. తిరుమలయ్యపల్లి ఎంపీటీసీ స్థానంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి 645 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. వెదురుకుప్పం మండల జడ్పీటీసీ స్థానంలోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలుపొందారు. ఇలా పలు ఎంపీటీసీ స్థానాలతో పాటు జడ్పీటీసీ స్థానాన్ని కూడా వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకోవడంతో మండలంలో ఆ పార్టీ విజయాలు ప్రత్యేకంగా నిలిచాయి.

-పాలసముద్రం మండలంలో టీడీపీ ఆధిక్యం

పాలసముద్రం మండల పరిధిలోని కృష్ణ తిమ్మాపురం, ఆముదాల, పాలసముద్రం ఎంపీటీసీ స్థానాల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. అదేవిధంగా జడ్పీటీసీ స్థానాన్ని కూడా టీడీపీ కైవసం చేసుకుంది. టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి భీమనేని జ్ఞాహని విజయం సాధించారు.

-పెనుమూరు మండలంలో ఇరు పార్టీలకు విజయాలు

పెనుమూరు మండలంలో చింతపంట, కేసీపల్లె, గుంటిపల్లి ఎంపీటీసీ స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు గెలుపొందగా, పెనుమూరు, తాటిమాకులపల్లె ఎంపీటీసీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించారు.

-కార్వేటినగరం మండలంలో ఇరు పార్టీలకు విజయాలు

కార్వేటినగరం మండల పరిధిలోని సీడీ కండ్రిగ, కార్వేటినగరం-2 ఎంపీటీసీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించగా, కార్వేటినగరం-1, కె. కర్పకం స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు గెలుపొందారు. ఆలత్తూరు ఎంపీటీసీ స్థానంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సోనీ 120 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. గోపిశెట్టిపల్లి ఎంపీటీసీ స్థానంలో టీడీపీ అభ్యర్థి కె. లక్ష్మి 386 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కొల్లాగుంట ఎంపీటీసీ స్థానంలో నిధి 235 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

-కార్వేటినగరం మండల జడ్పీటీసీ స్థానాన్ని వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది.

జీడీ నెల్లూరు మండలంలో టీడీపీకి మెజార్టీ స్థానాలు జీడీ నెల్లూరు మండల పరిధిలో వెల్లడైన ఫలితాల్లో మహాదేవమంగళం, కోటగారం, ఆంబోదరపల్లి, కొట్రకోన, కడపగుంట, మొక్కలతూరు, వేల్కూర్, పెద్దకాలువ ఎంపీటీసీ స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. వెజ్జుపల్లి ఎంపీటీసీ స్థానంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గెలుపొందారు. కోటగారం ఎంపీటీసీ స్థానంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వి. హరీష్ యాదవ్ 1,156 ఓట్ల భారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు. జీడీ నెల్లూరు ఎంపీటీసీ సెగ్మెంట్‌లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆర్. షర్మిల 149 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. డీ నెల్లూరు మండల జడ్పీటీసీ స్థానాన్ని కూడా తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుంది. ఇతర ఎంపీటీసీ స్థానాల్లో విజేతలు నియోజకవర్గ పరిధిలోని వేపంజేరి ఎంపీటీసీ స్థానంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయం సాధించగా, వరతూరు ఎంపీటీసీ స్థానంలో టీడీపీ అభ్యర్థి గెలుపొందారు. అలాగే తుగుండ్రం ఎంపీటీసీ స్థానంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కె. రాజేంద్రరెడ్డి విజయం సాధించారు.

-ఎస్.ఆర్.పురం మండలంలో వైఎస్సార్‌సీపీకి విజయాలు

ఎస్.ఆర్.పురం మండల పరిధిలోని తయ్యూరు ఎంపీటీసీ సెగ్మెంట్‌లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయం సాధించారు. అదేవిధంగా ఎస్.ఆర్.పురం జడ్పీటీసీ స్థానాన్ని కూడా వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది. వెల్లడైన జడ్పీటీసీ ఫలితాల్లో వైఎస్సార్‌సీపీకి మూడు జీడీ నెల్లూరు నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు ఐదు జడ్పీటీసీ స్థానాల ఫలితాలు వెల్లడయ్యాయి. పాలసముద్రం, గంగాధర నెల్లూరు జడ్పీటీసీ స్థానాలను తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకోగా, కార్వేటినగరం, ఎస్.ఆర్.పురం, వెదురుకుప్పం జడ్పీటీసీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించారు. దీంతో ఇప్పటివరకు వెల్లడైన ఫలితాల్లో వైఎస్సార్‌సీపీ మూడు, టీడీపీ రెండు స్థానాలను దక్కించుకున్నాయి. మరో జడ్పీటీసీ స్థానం ఫలితం వెలువడాల్సి ఉంది. వెదురుకుప్పం జడ్పీటీసీ స్థానంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి భారీ మెజార్టీతో విజయం సాధించడం విశేషం.

-విజేతలకు అభినందనలు

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఫలితాలు వెలువడటంతో ఆయా మండలాల్లో గెలుపొందిన అభ్యర్థుల అనుచరులు, పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. విజయం సాధించిన అభ్యర్థులకు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో వెలువడిన ఫలితాలతో స్థానిక రాజకీయ వర్గాల్లో ఎన్నికల ఫలితాలపై చర్చ కొనసాగుతోంది.

పోరాటం, కృషి ఫలితంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అఖండ మెజారిటీతో విజయం

-అడ్డంకులు, కేసులు పెట్టినా వెనక్కి తగ్గని వైసీపీ శ్రేణులు..

-వేంపల్లి, వేములలో అఖండ విజయం

-వైసీపీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపిన కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

పులివెందుల కదిలించే వార్త నవంబర్ 7



జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల సందర్భంగా టీడీపీ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను అనేక ఇబ్బందులకు గురిచేశారని, పోలింగ్ బూత్‌లకు వెళ్లకుండా అడ్డంకులు సృష్టించడంతో పాటు రిగ్గిం గ్‌కు పాల్పడ్డారని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆరోపించారు.టీడీపీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎన్ని కేసులు పెట్టినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా నిలబడి పార్టీ కోసం పనిచేశారని ఆయన పేర్కొన్నారు. వారి పోరాటం, కృషి ఫలితంగానే వేంపల్లి, వేముల ప్రాంతాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అఖండ మెజారిటీతో విజయం సాధించిందని తెలిపా రు.ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంటే ఉన్నారని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల మద్దతును దూరం చేయలేరని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని అడ్డుకోవాలని చూస్తే ప్రజలే తగిన సమయంలో గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన ప్రతి ఒక్క వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడికి, కార్యకర్తకు, అభిమానులకు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కేసులు, ఒత్తిళ్లు, అడ్డంకులను ఎదుర్కొంటూ పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరి సేవలను అభినందించారు. ఈ విజయం పార్టీ శ్రేణుల ఐక్యతకు, ప్రజల మద్దతుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

ఎన్నికల ఫలితాల వేళ వేంపల్లిలో నిషేధాజ్ఞలు

-ఐదుగురికి మించి గుమికూడితే చర్యలు.. విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, సమావేశాలపై నిషేధం





వేంపల్లె నవంబర్ 7 (కదిలించే వార్త):

ఎంపీటీసీ , జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన నేపథ్యంలో వేంపల్లి మండలంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తగా నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వెల్లడించారు.వేంపల్లి మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ ఉత్తర్వుల మేరకు భారతీయ నాగరిక్ సురక్షా సంహిత -2023 సెక్షన్ 163, పులివెందుల ఎస్డీపీఓ ఆదేశాల మేరకు పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 అమలులో ఉన్నట్లు తెలిపారు.ఈ నేపథ్యంలో ఐదుగురికి మించి ప్రజలు గుమికూడటంపై నిషేధం విధించారు. ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, సమావేశాలు నిర్వహించడం, బాణసంచా కాల్చడం, డీజేలు ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు.కౌంటింగ్ కేంద్రాల వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించినా, నిషేధాజ్ఞలను ఉల్లంఘించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులు, వారి అనుచరులు సంయమనం పాటించాలని, ప్రజలకు ఇబ్బందులు కలిగించే కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు.ఎన్నికల ఫలితాల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ విజ్ఞప్తి చేశారు.

పవిత్ర పుణ్యక్షేత్రమైనభక్తి శ్రద్ధలతో నగర సంకీర్తనలు

తిరుపతి కదిలించే వార్త 7 నవంబర్



తిరుపతి నగరం ప్రతి శనివారం తెల్లవారు జామున భక్తి పారవశ్యంలో మునిగిపోతూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకు ంటోంది. కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామివారి కృప కటాక్షాలు నగర మంతా విరాజిల్లాలని ఆకాంక్షిస్తూ భజన మండలి సభ్యులు ప్రతివారం నిర్వహిస్తున్న నగర సంకీర్తన భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.శనివారం ఉదయం బ్రహ్మముహూర్తానికే భక్తులు సంప్రదాయ వస్త్రధారణలో, నుదుటిపై గోవింద నామాలతో గోవిందరాజస్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్దకు ఉదయం ఐదు గంటలకే చేరుకుంటారు. అక్కడ శ్రీహరి నామస్మరణల మధ్య మేళతాళాలు, మంగళ వాయిద్యాల నాదంతో నగర సంకీర్తన ఘనంగా ప్రారంభమవుతుంది. ‘‘గోవింద... గోవింద...’’ అంటూ మారుమోగే నామసంకీర్తనతో తిరుపతి వీధులన్నీ భక్తి భావంతో నిండిపోతాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు భక్తులు భజనల్లో పాల్గొంటూ ఆధ్యాత్మిక ఆనందాన్ని అనుభవిస్తున్నారు. ప్రతి ఇంటిలో భక్తి భావం వెల్లివిరియాలని సంకల్పంతో మండలి సభ్యులు సేవా తత్పరతతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.సంకీర్తన అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేసి కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో ముగించారు. భక్తి, సేవా భావం, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్న ఈ నగర సంకీర్తన తిరుపతి ఆధ్యాత్మిక వైభవాన్ని మరింతగా చాటిచెబుతోంది. ఈ కార్యక్రమంలో నగర సంకీర్తన మండలి సభ్యులు, , మునెప్ప మునినాథరెడ్డి, భాస్కరాచారి, వాసుదేవ రెడ్డి, గుండాల గోపీనాథ్,, , కృష్ణంరాజు, పురుషోత్తమ యాదవ్, వెంకటరమణ, మేకల గంగయ్య, రాజేంద్రన్, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, కొండే చెంగారెడ్డి, వెంకటరమణ, మణికంఠ వాసు, ఎల్ కృష్ణయ్య, మధు,శ్రీనివాస్, నాగేశ్వర్ రెడ్డి,అరుణమ్మ, జయమ్మ,, ధనమ్మ, విజయ కుమారి, అమరావతి, పావని, ఉషశ్రీ,రేవతి, ఉమా జి, పద్మ, వై పద్మావతి, ధనమ్మ, కల్పన, నాగరాజామ్మ, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ సాధికారిక మండలి సభ్యులు కె.కన్నబాబు ప్రమాణస్వీకారం

తిరుమల కదిలించే వార్త 7 నవంబర్



తిరుమలలో శ్రీవారి ఆలయంలో టీటీడీ సాధికారిక మండలి సభ్యులుగా ఆంధ్రప్రదేశ్ దేవాదాయశాఖ సెక్రటరీ .ఎఫ్ఏసీ కె.కన్నబాబు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. తిరుమల శ్రీవారి ఆలయంలోని బం గారు వాకిలి వద్ద జరిగిన కార్యక్రమంలో టీటీడీ అద నపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి ఆయనతో ప్రమాణం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించి శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆలయం ముందు మీడియాతో కె.కన్నబాబు మాట్లాడుతూ, కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవేంకటేశ్వర స్వామివారి పిలుపు, అనుగ్రహంతో తనకు ఈ గొప్ప అవకాశం లభించిందని అన్నారు. తనపై విశ్వాసం ఉంచి సాధికారిక మండలి సభ్యుడిగా నియమించిన ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, తన శక్తిమేరకు పూర్తిస్థాయిలో సేవలందిస్తానని తెలిపారు.సాధికారిక మండలి చైర్మన్ ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయ ధార్మికత, విశిష్టతను ఖండాంతరాలకు విస్తరించేలా భక్తిశ్రద్ధలతో ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో భాస్కర్, బోర్డ్ సెల్ డిప్యూటీ ఈవో శ్రీమతి ప్రశాంతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ముందస్తు దీపావళి వేడుకల్లో చైతన్య హైస్కూల్ విద్యార్థుల సందడి

-నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, సందేశాత్మక స్కిట్లతో అలరించిన చిన్నారులు

వేంపల్లె నవంబర్ 7 (కదిలించే వార్త):




ముందస్తు దీపావళి వండుగను పురస్కరించుకుని వేంవల్లి చైతన్య హైస్కూల్‌లో వేడుకలను శనివారం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. పాఠశాల ప్రాంగణాన్ని రంగురంగుల విద్యుద్దీపా లు, ఆకర్షణీయమైన అలంకరణలతో ముస్తాబు చేయడంతో పండుగ శోభ సంతరించుకుంది. సంప్రదాయ దుస్తులు, విభిన్న ఫ్యాన్సీ డ్రెస్సుల్లో ముస్తాబైన విద్యార్థులు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సందేశాత్మక స్కిట్లు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. దీపావళి వండుగ విశిష్టతను వివరిస్తూ చిన్నారులు చేసిన ప్రసంగాలు, చక్కటి అభినయం ప్రేక్షకులను అలరించాయి. ప్రతి ప్రదర్శనలోనూ విద్యార్థుల ప్రతిభ, సృజనాత్మకత, ఉత్సాహం ప్రతిబింబించాయి. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో విద్యార్థులు చేసిన ఏర్పాట్లు వేడుకలకు మరింత వన్నె తెచ్చాయి.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ బి. చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ దీపావళి కేవలం దీపాల పండుగ మాత్రమే కాదని, చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని అన్నారు. విద్యార్థులు వండుగలను ఆనందోత్సాహాలతో జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. బాణసంచా వినియోగం వల్ల కలిగే వాయు, శబ్ద కాలుష్యాన్ని తగ్గించి, ప్రకృతికి హాని కలగకుండా పండుగను జరుపుకోవాలని పిలుపునిచ్చారు.విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల సందడి, కళా ప్రదర్శనలు, పండుగ అలంకరణలతో పాఠశాల ప్రాంగణం దీపావళి వెలుగులతో కళకళలాడింది. వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ముగిశాయి.



దీపావళి పర్వదినం సందర్భంగా వేంపల్లిలో వృషభాచలేశ్వర స్వామి గ్రామోత్సవం

-ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు ఉత్సవం.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ పిలుపు

వేంపల్లె నవంబర్ 7(కదిలించే వార్త):





దీపావళి వర్వదినాన్ని పురస్కరించుకుని వేంపల్లి వట్టణంలోని శ్రీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం (నవంబర్ 8) స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు సాయంత్రం 4.30 గంటల నుంచి ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో గ్రామోత్సవ కార్యక్రమం ప్రారంభం కానుంది.ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామోత్సవం చేవట్టనున్నారు. కావున వట్టణంలోని భక్తులందరూ కుటుంబ సమేతంగా పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి, గ్రామోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు కోరారు.ఈ మేరకు దేవస్థానం కార్యనిర్వహణ అధికారి కడవ సుభాష్, ఆలయ చైర్మన్ వీవీ రమణ భక్తులకు ఆహ్వానం పలికారు.

పూర్ణాహుతితో ముగిసిన శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి పవిత్రోత్సవాలు

తిరుపతి రూరల్ కదిలించే వార్త 7 నవంబర్







శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మూడు రోజుల పాటు శాస్త్రోక్తంగా నిర్వహించిన పవిత్రోత్సవాలు శనివారం పూర్ణాహుతితో వైభవంగా ముగిశాయి. చివరి రోజు ఉదయం స్వామివారికి సుప్రభాతం, తోమాలసేవ, కొలువు నిర్వహించారు. అనంతరం యాగశాలలో వైదిక కార్యక్రమాల తరువాత శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేష అభిషేకం చేశారు.సాయంత్రం యాగశాలలో వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి, కుంభప్రోక్షణ నిర్వహించి, ఆచార్యులకు బహుమానం సమర్పించడంతో పవిత్రోత్సవాలు సంపూర్ణమయ్యాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో శ్రీమతి వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు శ్రీ రాజ్ కుమార్, హరికృష్ణ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వ్యర్థాలను తగ్గిద్దాం కార్యక్రమంలో భాగంగా ఏడవ రోజు అనే ఇతివృత్తంతో

తిరుపతి కదిలించే వార్త 7 నవంబర్





తిరుపతిలో శనివారం తిరుపతి జిల్లా రవాణా శాఖ అధికారి కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆహార వ్యర్థాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, నీటి వృథా మరియు కాగితాల వృథాను తగ్గించడంపై అవగాహన కల్పించారు.అవసరమైనంత ఆహారాన్నే తీసుకోవడం, మిగిలిన ఆహారాన్ని వృథా చేయకుండా వినియోగించడం, పాత మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, బ్యాటరీలను నిర్దేశిత కేంద్రాలకు అందించడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారించడం, నీటిని పొదుపుగా వాడడం, కార్యాలయాల్లో కాగితాల వాడకం తగ్గించి డిజిటల్ విధానాలను ప్రోత్సహించడం వంటి అంశాలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ మాట్లాడుతూ ప్రయాణ సమయంలో రోడ్లపై చెత్త వేయరాదని అలాగే ప్లాస్టిక్ బాటిల్లు కవర్లను రోడ్లపై వడేయకూడదని, వాహనాల నిర్వహణలో వచ్చే వ్యర్థాల విషయంలో బాధ్యత వహించాలని తెలిపారు అనంతరం అధికారులు, సిబ్బంది “=వఒబవ, =వబంవ, =వఒఎశ్రీవ – తగ్గించు, తిరిగి వాడు, పునర్వినియోగించు” అనే నినాదంతో పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఇందులో భాగంగా ఆర్టీవో సిబ్బంది డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ నందు శ్రమదానం చేసి వ్యర్థ మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వాహన తనిఖీ అధికారులు సుబ్రహ్మణ్యం, అతికా నాజ్, స్వర్ణలత, పరిపాలనా అధికారులు విజయ్ కుమార్, విజయ ప్రశాంతి, కాలుష్య నియంత్రణ మండలి అధికారి దేవరాజులు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ రౌడీ సినిమాను తలపించిన పెళ్లకూరు జడ్పీటీసీ ఎన్నికల ఫలితం..

తిరుపతి రూరల్ కదిలించే వార్త 7 నవంబర్



తిరుపతి జిల్లాలో పెళ్లకూరు జడ్పిటిసి ఎన్నికల్లోందైలెు గోదల వెనుక భర్త.. ప్రజాక్షేత్రంలో భార్య పోరాటం... చివరికి విజయం తల వంచిన వైనం. కుటుంబానికి అండగా ఎవరు నిలిచినా.. నిలవకపోయినా నాయకులు.. ప్రజలు అండగా నిలిచారు.. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి 1719 ఓట్లతో విజయం సాధించారు...అ విజయంలో ఆయన జీవిత భాగస్వామి కీలక పాత్ర పోషించారు. రాజకీయ ప్రత్యర్థుల అంచనాలను తలకిందులు చేసిన ప్రజాతీర్పు.. పెళ్లకూరు రాజకీయాల్లో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్.. తిరుపతి జిల్లా పెళ్లకూరు మండల జడ్పీటీసీ ఎన్నికల ఫలితాలు రాజకీయ వర్గాల్లో ఒక్కసారిగా చర్చనీయాంశంగా మారాయి. ఒకవైపు జైలు గోదల మధ్య భర్త.. మరోవైపు ప్రజాక్షేత్రంలో ఎన్నికల ప్రచార బాధ్యతలను భుజాన వేసుకున్న భార్య పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నా వెనుకడుగు వేయకుండా ఎన్నికల బరిలో నిలిచి వైఎస్సార్‌సీపీ తరపున ఘనవిజయం సాధించడం రాజకీయంగా ప్రత్యేక ఆసక్తిని రేకెత్తించింది. కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి జైలులో ఉన్న సమయంలో ఆయన జీవిత భాగస్వామి స్వయంగా ప్రచార బాధ్యతలు చేపట్టి ప్రజల్లోకి వెళ్లారు. కుటుంబ పరిస్థితులు ఒకవైపు.. రాజకీయ సవాళ్లు మరోవైపు.. అయినా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి ప్రత్యర్థుల రాజకీయ వ్యూహాలకు ప్రజాతీర్పుతో సమాధానం చెప్పించారు.కుటుంబానికి అండగా నిలిచేవారు ఉన్నా లేకున్నా.. మండల ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తమకు అండగా నిలిచారని, దేవుడి దీవెనలు తమపై ఉన్నాయని ఆమె వర్గీయులు పేర్కొంటున్నారురాజకీయాల్లో అధికారం, అంగబలం, అర్థబలం మాత్రమే విజయాన్ని నిర్ణయించవని.. ప్రజల ఆదరణ, నమ్మకం, కార్యకర్తల కష్టమే అసలైన బలమని ఈ ఎన్నికల ఫలితం మరోసారి నిరూపించాయి అని రాజకీయ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది..మొత్తానికి.. జైలు గోదలు ఒకరిని బంధించగలవేమో కానీ, ప్రజల్లో ఉన్న రాజకీయ ఆదరణను బంధించలేవన్న రీతిలో పెళ్లకూరు జడ్పీటీసీ ఎన్నికల ఫలితం రాజకీయ ప్రత్యర్థులకు గట్టి సందేశాన్ని ఇచ్చిందనే అభిప్రాయాలు మండల ప్రజల మదిలో వ్యక్తమవుతున్నాయి.

Printed, Published, Owend by Neeruganti Shashikala& Printed at Sreenivasa Offset Printers D.No 12-73-A, Sai Nagar, Anantapur (DE)APTEL/RNI NO/2021/81405 &
Published at D. NO. 12-73-A, Sal Nagar. Anantapur. ANANTAPUR (DE).(A.P) Editior Neeruganti Shashikala Cell: 6303427710